
జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




నిజామాబాద్ | సంపుటి : 01 | సంచిక : 05 | పేజీలు : 8 | మంగళవారం 13 జనవరి 2026 | వెల : 2/-



## కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ.. మారనున్న పీఎంవో చిరునామా

- రాయ్‌సీనా హిల్స్ వద్ద సిద్ధమైన ప్రధాని కొత్త కార్యాలయం
- 'సేవా తీర్థ'గా నామకరణం చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఈ నెల 14 తర్వాత పీఎంవో తరలింపు ఉంటుందని అంచనా
- స్వాతంత్ర్యం తర్వాత తొలిసారి సౌత్ బ్లాక్ నుంచి మారనున్న పీఎంవో
- మ్యూజియంగా మారనున్న ప్రస్తుత నార్త్, సౌత్ బ్లాకులు

☞ 4

## వాహనాల చలాన్లకు
# డిస్కౌంట్ ఇవ్వొద్దు..
– సీఎం రేవంత్ రెడ్డి

- వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ డిస్కౌంట్ ఇస్తారనే ఆలోచన ఉందని వ్యాఖ్య
- వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని సూచన
- చలాన్ పడ్డ వెంటనే బ్యాంకు ఖాతా నుంచి వెంటనే డబ్బులు కట్ కావాలి
- మైనర్లకు ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులపై కేసు పెట్టాలన్న ముఖ్యమంత్రి




డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : వాహనాలకు చలాన్లు విధిస్తున్నప్పటికీ, డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన ఒక పెద్ద సమస్యగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వరాదని ఆయన సూచించారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుంటే, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.....

☞ 2

## సరిహద్దులో పాక్ డ్రోన్ల కలకలం
### – జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాల హై అలర్ట్

- సాంబా, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లోని ఐదు ప్రాంతాల్లో డ్రోన్ల కదలికల గుర్తింపు
- రాజౌరీలోని నౌషెరా సెక్టార్‌లో డ్రోన్‌పై మెషిన్ గన్లతో కాల్పులు జరిపిన సైన్యం
- ఆయుధాలు, మాదకద్రవ్యాల కోసం సరిహద్దు వెంబడి గాలింపు చర్యల ముమ్మరం



డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : జమ్మూకశ్మీర్ అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వెంబడి ఆదివారం సాయంత్రం పాకిస్థాన్ డ్రోన్లు కలకలం రేపాయి. సాంబా, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లోని సుమారు ఐదు ప్రాంతాల్లో ఈ డ్రోన్ల కదలికలను గుర్తించిన భద్రతా దళాలు రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించాయి. భారత భూభాగంలోకి ప్రవేశించిన ఈ డ్రోన్లు సున్నితమైన ప్రాంతాల్లో కొద్దిసేపు తచ్చాడి, తిరిగి పాక్ వైపు వెళ్లిపోయాయి. రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లోని గనియా-కల్సియన్ గ్రామం వద్ద డ్రోన్ కదలికలను గమనించిన ఆర్మీ దళాలు వెంటనే అప్రమత్తమై మెషీన్ గన్లతో కాల్పులు జరిపాయి. అదే సమయంలో తర్యత్ ప్రాంతంలోని ఖబ్బర్ గ్రామం వద్ద కూడా వెలుగులు జిమ్మే డ్రోన్ వంటి వస్తువు కనిపించి మాయమైంది. సాంబా జిల్లా రామ్‌గఢ్ సెక్టార్, పూంచ్ జిల్లా ...

మిగతా 2 లో..

## బడ్జెట్ ఆ రోజే..
### - తేదీపై క్లారిటీ




డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు): కేంద్ర బడ్జెట్ 2026–27 సమర్పణ తేదీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. ఫిబ్రవరి 1, ఆదివారం రోజే బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం ధృవీకరించారు. ఓ విలేకరుల సమావేశంలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఫిబ్రవరి 1, ఆదివారం ఉదయం 11 గంటలకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారని స్పీకర్ తెలిపారు. సాధారణంగా బడ్జెట్ ప్రవేశపెట్టే ఫిబ్రవరి 1వ తేదీ ఈసారి ఆదివారం కావడంతో తేదీలో ఏమైనా మార్పు ఉంటుందా అనే ఊహాగానాలు వినిపించాయి. తాజాగా స్పీకర్ ప్రకటనతో ఈ గందరగోళం తొలగిపోయింది.



### తెలంగాణ సర్కారుకు
## షాక్ ఇచ్చిన సుప్రీంకోర్టు

- పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీం తీర్పు
- తెలంగాణ ప్రభుత్వ పిటిషన్ విచారణకు అర్హత లేదన్న సుప్రీం
- పిటిషన్ ఉపసంహరించుకున్న తెలంగాణ ప్రభుత్వం

డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సుప్రీం స్పష్టం చేసింది. తెలంగాణ తరపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. పోలవరం ప్రాజెక్టును నల్లమల్ల సాగర్‌తో లింక్ చేయడం వల్ల తెలంగాణకు నష్టమని, గోదావరి నీటి కేటాయింపులు ఉల్లంఘన అవుతున్నాయని కోర్టుకు ఆయన వివరించారు. వాదనలు విన్న సుప్రీంకోర్టు... ఈ పిటిషన్ ను కొనసాగించలేమని, ఈ కేసుతో కర్ణాటక, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాలు కూడా ముడిపడి ఉన్నాయని వ్యాఖ్యానించింది. అందుకే, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు (మీడియేషన్ లేదా సివిల్ సూట్) ద్వారా పరిష్కారం కోరవచ్చని సూచించింది. దీంతో, తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నామని సుప్రీంకోర్టుకు సింఘ్వీ తెలిపారు. సివిల్ సూట్ దాఖలు చేస్తామని కోర్టుకు తెలిపారు.

## ఇది చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్ : హరీశ్ రావు



- ఏపీ, తెలంగాణ మధ్య జలవివాదాలు
- తెలంగాణ పిటిషన్ ను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- సుప్రీంకోర్టులో బలహీనమైన పిటిషన్ వేసి ఏపీకి సహకరిస్తున్నారని హరీశ్ విమర్శ
- రిట్ ఉపసంహరణ ఏపీకి ప్రాజెక్టు కట్టుకునేందుకు సమయం ఇవ్వడమేనని వ్యాఖ్య
- గురుదక్షిణ కోసమే తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ రెడ్డి తాకట్టు పెడుతున్నారని ఆక్షేపణ

డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన రాజకీయ గురువు, ఏపీ మాజీ సీఎం చంద్రబాబుకు ఓ విలువైన బహుమతి ఇచ్చారని, అదే సుప్రీంకోర్టులో వేసిన బలహీనమైన రిట్ పిటిషన్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న పోలవరం - నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఏపీకి పూర్తిస్థాయిలో సహకరిస్తోందని, రేవంత్ రెడ్డి నిజస్వరూపం, ద్రోహబుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలైందని ఆయన ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసేలా ప్రాజెక్టులు కడుతుంటే, కాంగ్రెస్ సర్కారు కావాలనే విచారణకు అర్హత లేని పిటిషన్ వేసి ...

2

## వారు చీకట్లో మిగిలిపోయారు
### తెలంగాణ మెరిసిపోతోంది - కేటీఆర్

- యాదాద్రి ప్లాంట్ నాలుగో యూనిట్ లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం
- తెలంగాణ విద్యుత్ రంగంలో మైలురాయి అని కేటీఆర్ కితాబు
- కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారిందని వ్యాఖ్య




డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి కావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మునిగిపోతుందని ఆనాడు కొందరు అసత్యాలు ప్రచారం చేశారని... ఆ మాటలను తెలంగాణ పటాపంచలు చేసిందని అన్నారు. ఆనాడు అసత్యాలు ప్రచారం చేసిన వారే ఇప్పుడు చీకట్లో మిగిలిపోయారని, తెలంగాణ మాత్రం వెలుగుల్లో మెరిసిపోతోందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణ విద్యుత్ మిగులు రాష్ట్రంగా మారిందని కేటీఆర్ అన్నారు.

## ఇస్రో రాకెట్ ప్రయోగం విఫలం

- సమస్యను విశ్లేషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు
- నిర్ణీత సమయానికి నింగికెగిరిన పీఎస్ఎల్వీ - సీ62
- రెండు దశల పాటు సాఫీగా సాగిన రాకెట్ ప్రయాణం

డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలమైంది. తొలి రెండు దశల్లో సాఫీగా సాగిన రాకెట్.. మూడో దశలో గతి తప్పింది. ఈ రోజు ఉదయం 10.18 గంటలకు శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి పీఎస్ఎల్వీ-- సీ62 రాకెట్ నింగికెగిరింది. 18 నిమిషాల ప్రయాణం తర్వాత ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చాలి. అయితే, సాంకేతిక సమస్య వల్ల రాకెట్ తో సంబంధాలు తెగిపోయాయని ఇస్రో ఛైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని, త్వరలోనే




పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ రంగానికి అత్యంత కీలకమైన 'ఈఓఎస్-ఎన్1' లేదా 'అన్వేష' ఉపగ్రహంతో పాటు భారత్, యూకే, థయ్‌లాండ్, బ్రెజిల్, స్పెయిన్, నేపాల్ తదితర దేశాలకు చెందిన మరో 14 చిన్న ఉపగ్రహాలను కూడా ఈ రాకెట్ మోసుకెళ్లింది. అత్యంత కీలకమైన 'అన్వేష' ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు చేపట్టిన రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో నిరాశ వ్యక్తమవుతోంది. కాగా, 2025 మే 18న ప్రయోగించిన పీఎస్ఎల్వీ -- సీ61 రాకెట్ ప్రయోగం కూడా ఇదేవిధంగా మూడో దశలోనే విఫలమైంది. ఈ ప్రయోగంలో జరిగిన తప్పొప్పులను నిశితంగా పరిశీలించి, పొరపాట్లను సరిదిద్దుకున్నాక చేపట్టిన తాజా ప్రయోగం కూడా ఫెయిలైంది.

# వాహనాల చలాన్లకు డిస్కౌంట్ ఇవ్వొద్దు..

## - సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి..
మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యేలా, వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు పెట్టాలని ఆయన ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల విషయంలో రవాణా శాఖ, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన ప్రమేయం లేకున్నా, ఎదుటివారి తప్పుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

# ఇది చంద్రబాబుకు రేవంత్ రెడ్డి ఇచ్చిన సంక్రాంతి గిఫ్ట్ - హరీశ్ రావు

మొదటి పేజీ తరువాయి..
చేతులు దులుపుకొందని విమర్శించారు.

"గతంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఏపీ ప్రభుత్వం రైతుల చేత రిట్ పిటిషన్లు వేయించి మరీ స్టే తెచ్చుకుంది. కానీ ఇక్కడి చేతకాని కాంగ్రెస్ సర్కారు మాత్రం తెలంగాణకు తీరని ద్రోహం చేస్తోంది. ఈ మాత్రం విషయం ప్రభుత్వ న్యాయవాది, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి తెలియదా? కేవలం రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూటు బూటు వేసుకుని ఢిల్లీ వెళ్లారా?" అని హరీశ్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉంటూ రాష్ట్ర నీటి హక్కులను ఏపీకి దారాదత్తం చేయడం చారిత్రక ద్రోహమని మండిపడ్డారు.

రిట్ పిటిషన్ ఉపసంహరించుకుని, సివిల్ సూట్ ఫైల్ చేస్తామని చెప్పడం ఏపీకి ప్రాజెక్టు పనులు పూర్తి చేసుకోవడానికి గడువు ఇవ్వడమేనని హరీశ్ రావు ఆరోపించారు. సివిల్ సూట్‌లో ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినాల్సి ఉంటుందని, ఇది ఏళ్లు గడిచినా తేలని వ్యవహారమని అన్నారు. ఈలోగా ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పూర్తి చేసుకుని తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలవరం-నల్లమల సాగర్ విషయంలో రేవంత్ ప్రభుత్వం మొదటి నుంచీ ఒక పద్ధతి ప్రకారం ఏపీకి సహకరిస్తోందని హరీశ్ ఆరోపించారు. "ఎజెండాలో లేదంటూనే బనకచర్లపై చర్చ జరిపారు. సంతకం పెట్టనంటూనే పెట్టి తెలంగాణ నదీ జలాలకు మరణశాసనం రాశారు. కమిటీ వేయనంటూనే వేసి ఏపీ జలదోపిడీకి రెడ్ కార్పెట్ వేశారు. ఇప్పుడు టెండర్ల ప్రక్రియ ముగిశాక కోర్టుకు వెళ్లి పరోక్షంగా ప్రాజెక్టుకు అంగీకారం తెలిపారు," అని విమర్శించారు.

కేవలం తన గురుదక్షిణ కోసమే రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను ఏపీకి తాకట్టు పెడుతున్నారని హరీశ్ రావు ఆక్షేపించారు. "పంచాయతీలు, న్యాయస్థానాలు వద్దని, కూర్చొని మాట్లాడుకుందాం అనడంలో అంతర్యం ఏమిటి? తెలంగాణ నీటి హక్కులను గంపగుత్తగా ఏపీకి అప్పగించడమే ఆ చర్చల లక్ష్యమా?" అని నిలదీశారు.

"తెలంగాణలోని కృష్ణా, గోదావరి నదులపై చంద్రబాబు, ఆంధ్రా ప్రభుత్వం అడ్డుకోని ప్రాజెక్టులు ఏమైనా ఉన్నాయా? అలాంటి చంద్రబాబుతో దోస్తీ కట్టి, తెలంగాణకు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమైన రేవంత్ రెడ్డీ... నిన్ను తెలంగాణ సమాజం క్షమించదు. రేవంత్ రెడ్డీ... నీ గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే తెలంగాణను సాధించిన బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. నీ దుర్మార్గాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతాం. తెలంగాణ నీటి హక్కుల కోసం పోరు చేస్తాం" అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# సరిహద్దులో పాక్ డ్రోన్ల కలకలం

## - జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాల హై అలర్ట్




మొదటి పేజీ తరువాయి..
మాన్‌కోట్ సెక్టార్‌లలో కూడా ఇదే తరహా డ్రోన్ల సంచారాన్ని అధికారులు ధ్రువీకరించారు.

ఈ డ్రోన్ల ద్వారా ఆయుధాలు లేదా మాదకద్రవ్యాలను భారత భూభాగంలోకి జారవిడిచారా? అన్న అనుమానంతో ఆర్మీ, పోలీసులు సంయుక్తంగా భారీ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. రెండు రోజుల క్రితమే సాంబా జిల్లా పాలూరా గ్రామం వద్ద డ్రోన్ ద్వారా పంపిన ఆయుధాలను (రెండు పిస్టల్స్, గ్రెనేడ్, బుల్లెట్లు) స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో తాజా కదలికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రిపబ్లిక్ డే సమీపిస్తున్న తరుణంలో సరిహద్దుల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

- వెల్వర్తి గ్రామంలో క్రీడా పోటీల ప్రారంభం
- గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తి చూపడం అభినందనీయం
- క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం
- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- మంచి స్నేహితులను ఎంచుకుని సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి
- భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి







వలిగొండ, జనవరి 12 (తొలివెలుగు): క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం వలిగొండ మండల పరిధిలోని వెల్వర్తి గ్రామంలో నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరు జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి ముందుకు సాగాలని, ఓటమిని అంగీకరించే గుణం ఉండాలని సూచించారు. ఓటమి గెలుపుకు పునాది అని పేర్కొన్నారు. క్రీడలు క్రమశిక్షణ, సహనం, సమయపాలన వంటి విలువలను నేర్పుతాయని, యువత తమ సమయాన్ని చదువు, క్రీడలు, మంచి అలవాట్లకు కేటాయిస్తే సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, అక్రమ కార్యకలాపాలకు యువత దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఒక్క తప్పు నిర్ణయం జీవితాన్నే నాశనం చేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. స్నేహితుల ప్రభావంతో తప్పుదారిలో వెళ్లకుండా మంచి స్నేహితులను ఎంచుకొని సానుకూల దృక్పథంతో జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. కష్టపడితేనే విజయం సాధ్యమని, క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, గ్రామ సర్పంచ్ చేముడాల అనిత నర్సింగ్, గ్రామ యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, ఆధ్యాత్మికత, సమాజ సేవలో ఇఎల్‌వి ఫౌండేషన్





- జై కేసారం పాఠశాలలో వంటగది నిర్మాణానికి శంకుస్థాపన
- పది రోజుల్లో మోక్ష లింగేశ్వర స్వామి ఆలయంలో షెడ్డు పూర్తి
- ఇ.ఎల్.వి ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్



చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు) : విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ఫౌండేషన్ లక్ష్యమని ఇ.ఎల్.వి ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ అన్నారు. జై కేసారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంటగది లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, సోమవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో భోజనం తయారు కావాలన్నారు. అనంతరం వలిగొండ రోడ్డులోని నూతన మోక్ష లింగేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న భాస్కర్, భక్తుల సౌకర్యార్థం పది రోజుల్లో షెడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. అదేవిధంగా శ్రీ కంఠమహేశ్వర కాలనీని సందర్శించి, అక్కడ కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఉన్న కాలనీవాసి కృష్ణారెడ్డిని పరామర్శించి ఉచిత మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ అశోక్, గ్రామ సర్పంచ్ సమిరెడ్డి భారతమ్మ జనార్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దశరథ నాయక్, పాలమాకుల రాకేష్, భీమిడి సందీప్, బోదాసు నరేష్, బండమీది యాదగిరి, బోదాసు నరసింహ, వనం విజయ్ కుమార్, మాధగోని యాదయ్య, దొడ్డి గణేష్, ఆదిముల్లా శంకర్ గురు స్వామి, దేవాలయ చైర్మన్ వీరమల్ల దాసు, ముప్పిడి కృష్ణ, పిట్టల సదానందం, దోర్నాల గజేందర్, దేశగాని వెంకన్న, దోటి రమేష్, దొనకొండ రాజు, పురోహితులు సంతోష్ కుమార్, కాలనీ ప్రెసిడెంట్ నోముల సత్తిరెడ్డి, మార్గం శివకృష్ణ యాదవ్, అయితేగోని వెంకటేష్ గౌడ్, కడమంచి రాయికల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడేవారినే గెలిపించండి

## - సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ




చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు): ప్రజా హక్కుల రక్షణ కోసం నిరంతరం శ్రమించే కమ్యూనిస్టులను ఆదరించాలని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సోమవారం చౌటుప్పల్‌లో నిర్వహించిన పార్టీ మున్సిపల్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై గుత్తాధిపత్యం చలాయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఒక దేశ అధ్యక్షుడిని కిడ్నాప్ చేయడం యుద్ధ మేఘాలకు దారితీస్తుందని వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విమర్శలు వస్తున్నా మోదీ ప్రభుత్వం మౌనంగా ఉండటం సరికాదన్నారు. దేశంలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతూ, గిరిజనులను అడవుల నుంచి తరిమివేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధి చేయాలంటే ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నాయకులు ఎండి పాషా, అవ్వారి రామేశ్వరి, మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, శ్రీనివాసచారి, యాదిరెడ్డి, బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, దండా అరుణ్ కుమార్, గోపగోని లక్ష్మణ్, తొర్పునూరి మల్లేశం, గోశిక స్వామి, గుర్రం నరసింహ, కందగట్ల ఆనంద్, ఉప్పాగుల రమేష్, బొడ్డు అంజిరెడ్డి, కామిశెట్టి ప్రభాకర్, జయమ్మ, ధర్మ రెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు వివేకానందుడి ఆలోచనలే స్ఫూర్తి



చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు): స్వామి వివేకానందుడి బోధనలు, ఆయన ఆలోచనలు నేటి యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కదారి కల్పన ఐలయ్య యాదవ్ అన్నారు. సోమవారం చౌటుప్పల్‌లోని పార్టీ కార్యాలయంలో వివేకానందుడి 163వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, వేదాంతాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు వివేకానందుడని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం జరుపుకోవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణగోని శంకరయ్య, సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి, కాసుల వెంకటేశం గౌడ్, ఎల్ల మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఉపాధ్యక్షులు వంగాల రమాకాంత్ గౌడ్, నల్ల శివప్రసాద్ యాదవ్, పర్నే శేఖర్ రెడ్డి, కంచర్ల వెంకట్ రెడ్డి, గుండపల్లి వెంకట్ రెడ్డి, భూత్ అధ్యక్షులు ఇటికాల దామోదర్ రెడ్డి, తరుణ్, గణేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

- నలుగురు లబ్ధిదారులకు రూ. 97వేల చెక్కుల పంపిణీ
- సర్పంచ్ జువ్వి నరసింహ




చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు): ఆపదలో ఉన్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరంలా మారిందని ధర్మోజిగూడెం గ్రామ సర్పంచ్ జువ్వి నరసింహ అన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 97,500 విలువైన చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కొంతం శ్రీనివాస్ రెడ్డికి రూ. 44,500, ముటుకుల్లోజు శ్రీనివాస చారికి రూ. 30,500, వల్లభోతు స్వామికి రూ. 14,000, సామిడి యాదమ్మకు రూ. 13,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నరసింహ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని, అవసరంలో ఉన్న నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లభోతు నారాయణ, వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, మాజీ ఉప సర్పంచ్ కొంతం బుచ్చిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు కొంతం పద్మ రాంరెడ్డి, ఊదరి లింగయ్య, వల్లభోతు కృష్ణ, కార్యకర్తలు సామిడి లింగారెడ్డి, ఊదరి పోశయ్య, వల్లభోతు లింగయ్య, గ్రామస్తులు సామిడి నర్సిరెడ్డి, ఎంగలి భీమిరెడ్డి, ఎంగలి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైసమ్మ ఆలయ వేలంలో పాల్గొనండి - ఈఓ మోహన్ బాబు



చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు): చౌటుప్పల్ మండల పరిధిలోని దండు మల్కాపురం గ్రామంలో వెలసిన శ్రీ ఆందోళ్ మైసమ్మ దేవస్థానంలో వివిధ విభాగాల నిర్వహణ హక్కుల కోసం మంగళవారం (జనవరి 13) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి (ఈఓ) సల్వాది మోహన్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలు మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇందులో కొబ్బరికాయల విక్రయ కేంద్రం, పూజా సామాగ్రి విక్రయ కేంద్రం, కిరాణా జనరల్ స్టోర్ నిర్వహణ, అలాగే సీ.సీ. కెమెరాల నిర్వహణ హక్కులు వేలంలో ఉంచనున్నట్లు వివరించారు. ఆసక్తి గల వారు ఆలయ నిబంధనల ప్రకారం అర్హతలు కలిగి వేలంలో పాల్గొనాలని ఈఓ మోహన్ బాబు కోరారు.

# కోడ్ ముగిసినా.. వీడని 'ముసుగు'!

- వలిగొండ మండలంలో పార్టీ గద్దెలకు ఇంకా గ్రీన్ మ్యాట్లే
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



వలిగొండ, జనవరి 12 (తొలివెలుగు): ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ వలిగొండ మండల పరిధిలోని పలు గ్రామ పంచాయతీల్లో రాజకీయ పార్టీలకు చెందిన గద్దెలపై వేసిన ముసుగులు ఇంకా తొలగకపోవడం చర్చనీయాంశంగా మారింది. సంగెం, వర్కట్‌పల్లి తదితర గ్రామాల్లో పార్టీ నాయకుల గద్దెలు కనిపించకుండా గ్రీన్ మ్యాట్లు కట్టివేయగా, గత నెలలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ చర్యలు చేపట్టారు. అయితే, ఎన్నికల కోడ్ ఎత్తివేసి రోజులు గడుస్తున్నప్పటికీ ఆయా గద్దెలపై వేసిన ముసుగులు తొలగించకపోవడంతో ఎన్నికల కోడ్ ఇంకా కొనసాగుతున్నట్లే ఉందని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పార్టీ నాయకుల గద్దెలకు వేసిన మ్యాట్లను ఎందుకు తొలగించడం లేదని పలు రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో మండల స్థాయి అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత గ్రామ పాలన అధికారులు వెంటనే స్పందించి, గద్దెలపై వేసిన ముసుగులను తొలగించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# చౌటుప్పల్ మున్సిపాలిటీ తుది ఓటర్ జాబితా విడుదల

**- కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి**





చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు ) : చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలోని 20 వార్డులకు సంబంధించిన ఫోటో ఆధారిత తుది ఓటర్ జాబితాను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి మధ్యాహ్నం 12:05 గంటలకు ఈ జాబితాను ప్రచురించారు. ముసాయిదా జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సవరణలు పూర్తి చేశామని కమిషనర్ తెలిపారు. వార్డు అధికారులు, టీపీఓలు, బీఎల్ఓలు, బిల్ కలెక్టర్ల ద్వారా పకడ్బందీగా ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. ఈ జాబితాను మున్సిపల్ కార్యాలయంతో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్వో అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## కొత్త కార్యాలయానికి ప్రధాని మోదీ... మారనున్న పీఎంవో చిరునామా

మొదటిపేజీ తరువాయి..

డెస్క్, జనవరి 12 (తొలి వెలుగు) : భారత ప్రధాని కార్యాలయం (పీఎంవో) చిరునామా త్వరలో మారనుంది. సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అత్యాధునిక కార్యాలయ భవన సముదాయంలోకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి 14 తర్వాత, మకర సంక్రాంతి అనంతరం ఆయన కొత్త కార్యాలయంలోకి ప్రవేశించవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఢిల్లీలోని సౌత్ బ్లాక్ నుంచే పీఎంవో కార్యకలాపాలు సాగుతుండగా, 78 ఏళ్ల తర్వాత తొలిసారి ఈ కార్యాలయం వేరే చోటుకు మారుతుండటం చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. రాయ్‌సీనా హిల్స్‌కు సమీపంలో, దారా షికో రోడ్డులో నిర్మించిన ఈ కొత్త భవన సముదాయానికి 'సేవా తీర్థ' అని ప్రభుత్వం నామకరణం చేసింది. ఇందులో మొత్తం మూడు భవనాలు ఉన్నాయి. 'సేవా తీర్థ్-1'ను పీఎంవో కోసం, 'సేవా తీర్థ్-2'ను కేబినెట్ సెక్రటేరియట్ కోసం, 'సేవా తీర్థ్-3'ను జాతీయ భద్రతా మండలి కోసం కేటాయించారు. ఇప్పటికే కేబినెట్ సెక్రటేరియట్ గత ఏడాది సెప్టెంబర్‌లోనే కొత్త భవనంలోకి మారింది. ఇప్పుడు పీఎంవో కూడా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో లార్సెన్ అండ్ టూబ్రో సంస్థ రూ. 1,189 కోట్ల వ్యయంతో 24 నెలల్లో ఈ నిర్మాణం పూర్తి చేసింది. పాలనలో అధికారం ('సత్తా') కాకుండా సేవకే ('సేవ') ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పేందుకే ఈ భవనానికి 'సేవా తీర్థ' అని పేరు పెట్టినట్లు గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రధాని కార్యాలయం, కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి వంటి కీలక కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల సమన్వయం మెరుగవుతుందని, భద్రత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పీఎంవో పూర్తిగా ఖాళీ అయిన తర్వాత చారిత్రక నార్త్, సౌత్ బ్లాక్‌లను 'యుగ యుగీన్ భారత్ సంగ్రహాలయ' పేరుతో జాతీయ మ్యూజియంగా మార్చనున్నారు.

# తొలి హామీ నెరవేర్చిన సర్పంచ్

❖ **కోతుల బెడద నివారణకు చర్యలు : జువ్వి నర్సింహ్మా**




చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ధర్మోజిగూడెం గ్రామాన్ని కోతుల బెడద నుంచి పూర్తిగా సంరక్షిస్తానని ఇచ్చిన తొలి హామీని సర్పంచ్ జువ్వి నర్సింహ్మా నిలబెట్టుకున్నారు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోతులను గ్రామం నుంచి తరలించేందుకు తన సొంత నిధుల నుంచి రూ. లక్ష విరాళంగా అందజేస్తూ చర్యలకు శ్రీకారం చుట్టారు. హామీ ప్రకారం కోతులు పట్టే సిబ్బందిని గ్రామానికి రప్పించి, సోమవారం ఉదయం నుంచి కోతులను పట్టేందుకు ప్రత్యేక బోనును ఏర్పాటు చేశారు. గ్రామంలో ఉన్న కోతులు ఒక్కొక్కటిగా ఆ బోనులోకి చేరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ జువ్వి నర్సింహ్మా మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా కోతుల బెడద నుంచి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తప్పక తొలగిస్తానని హామీ ఇచ్చానన్నారు. తన మొదటి ప్రాధాన్యత గ్రామాన్ని కోతుల సమస్య నుంచి విముక్తం చేయడమేనని చెప్పారు. త్వరలోనే గ్రామంలో కోతుల సమస్య పూర్తిగా తొలగిపోతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఆచరణలో పెట్టి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బత్తుల శ్రీహరి, పిసాటి దామోదర్ రెడ్డి, కొంతం కృష్ణారెడ్డి, జీడిముడ్ల కొండల్, చెన్నోజు విజయ్ చారి, కొంతం వెంకట్ రెడ్డి, గునుగుంటి సాయి తేజ, పగిళ్ల అమర్ నాథ్ రెడ్డి, రాచకొండ వెంకటేశం, గుర్రం యాదగిరి, గునుగుంటి వెంకటేశం, ఏషగోని మణిశంకర్, గుర్రం నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ముగియనున్న 'సర్వే నెం.106' భూ సమస్య

❖ **జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి**



చౌటుప్పల్, జనవరి 12 (తొలివెలుగు) : యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, రాచకొండ పరిధిలోని సర్వే నెం.106లో చౌటుప్పల్ మండలం అల్లాపురం గ్రామ రైతులకు సంబంధించిన భూ సమస్య పరిష్కారానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సోమవారం అల్లాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాయకుల విన్నపంపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు రావుతో ఫోన్‌లో మాట్లాడారు. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే ఈ భూ సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు అర్ధ వెంకట్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు సుర్కంటి స్వాతి శ్రీనివాస్ రెడ్డి, సుర్కంటి బుచ్చి రెడ్డి, బొడ్డు జంగయ్య, అచ్చిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, భూతం వెంకన్న, భూతం గణేష్, రాచకొండ మల్లేష్, మేడి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చెత్త వేస్తే చెల్లు.. నిఘా పెట్టిన పంచాయతీ!

- ❖ **స్వచ్ఛ భారత్.. స్వచ్ఛ తాజ్‌పూర్**
- ❖ **ప్రజలు చెత్త డబ్బాలను వినియోగించుకోవాలి**
- ❖ **స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామంలో డస్ట్‌బిన్ల ఏర్పాటు**
- ❖ **తడి చెత్తఉపొడి చెత్త వేరు వేరు గా వేయాలని సూచన**
- ❖ **నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.500 నుంచి రూ.1000 వరకు జరిమానా**
- ❖ **సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్**




భువనగిరి, జనవరి 12 (తొలివెలుగు) : స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ తాజ్‌పూర్ లక్ష్యంగా గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పలు చర్యలు చేపట్టినట్లు తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ తెలిపారు. సోమవారం గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు గా సేకరించేందుకు సుమారు క్వింటాళ్ల మేర చెత్త మోయగల సామర్థ్యం గల ట్రాలీ చెత్త డబ్బాలు (డస్ట్‌బిన్లు) ఏర్పాటు చేశారు. గ్రామంలో చెత్త సేకరణ వాహనం వెళ్లడానికి ఇబ్బందిగా ఉన్న గల్లీల్లో, ప్రజలు ఎక్కువగా సంచరించే చౌరస్తాల్లో, అధికంగా చెత్త జమయ్యే ప్రదేశాల్లో ఈ డస్ట్‌బిన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు తప్పనిసరిగా తడి చెత్తనుఉపొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేయాలని సర్పంచ్ సూచించారు. డస్ట్‌బిన్లను వినియోగించకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారం వేసినట్లయితే, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి రూ. 500 నుంచి రూ. 1,000 వరకు జరిమానా విధించనున్నట్లు గ్రామపంచాయతీ నిర్ణయించినట్లు వెల్లడించారు. గ్రామాన్ని పరిశుభ్రతలో అగ్రస్థానంలో నిలిపేందుకు గ్రామ ప్రజలంతా సహకరించాలని సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, యువత, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.